క్లుప్తంగా

అంబికాబాగ్ ఆలయంలో గోపూజ



గోవులకు పూజలు చేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు

దాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలో వెలసిన అంబికాబాగ్ సీతా రామచంద్రస్వామి ఆలయంలో కనుమ పండగను పురస్కరించుకుని గోవులకు సాంప్రదాయ రీతిన గోపూజ నిర్వహించారు. అక్కడి గోశాలలో గల పలు గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల చేతుల మీదుగా ఆహారం అందించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు, దేవాలయ అర్చకుడు బాలసుబ్రహ్మణ్యం (బాలు), సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద మేళోత్సవాలకు రాజశేఖర్



ఎంవీ రాజశేఖర్

దాబాగార్డెన్స్: భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఇల్లందు పటేల్ గ్రౌండ్స్‌లో ఈ నెల 18 నుంచి 20 వరకు కుసుమ హరనాథ నామ ప్రచార సంస్థ (నల్లకుంట, హైదరాబాద్)చే సాంప్రదాయ రీతిన నిర్వహించనున్న 80వ ఆనంద మేళోత్సవానికి విశాఖకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, దువ్వాడ శ్రీకుసుమ హరనాథ ఆశ్రమ కమిటీ సభ్యుడు ఎంవీ రాజశేఖర్‌కు ఆహ్వానం అందింది. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవంలో భాగంగా 18న ఉదయం 11 గంటలకు దీనదయాల్ ప్రభు హరనాథుడు, దీనదయామయి మాతృశ్రీ కుసుమ కుమారిదేవి 'ప్రేమతత్వం'అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేయనున్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఈవో జీవీ రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల స్వయంగా అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారి స్వయంగా జలాభిషేకం చేశారు. అనంతరం ఆలయ వర్గాలు భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు అస్సాం యువకుడు



తండ్రి చెంతకు చేరిన కుమారుడు

సీతమ్మధార: ఎలాంటి రవాణా సౌకర్యం లేని అతి మారుమూల గ్రామం సియాజ్ పూర్. అస్సాంలోని డిబ్రుఘర్ జిల్లా నాసిర్ ఖటియా తాలూకాలో ఉంది. ఆ ప్రాంతానికి చెందిన అకన జన్ మెక్ చిన్న కొడుకు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. తర్వాత మరో కొడుకు మిదుల్ కూడా ఉపాధి కోసమని స్నేహితులతో కలిసి ఇల్లు వదిలి వెళ్లడంతో తల్లి బెంగతో మంచం పట్టింది. మానసిక సమస్యతో బాధపడుతున్న మిదుల్‌ను సంవత్సరం క్రితం ద్వారకానగర్‌లో గల జీవీఎంసీ -ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు షెల్టర్ నిర్వాహకులు. అక్కడ ఆరోగ్యం కుదుటపడ్డాక శ్రద్ధా సంస్థ ద్వారా తీసుకెళ్లి తండ్రి అకనజన్ మెక్‌కు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి వాసు తెలిపారు.

జాతర్లు షురూ

- నేడు అల్లిపురం వేంకటేశ్వరస్వామి తీర్థ మహోత్సవం
- 20న కుమ్మరవీధి భక్త పోలమాంబ పరస.. దొండపర్తి రాములవారి తీర్థం
- 26న కోదండరామ పరస
- వచ్చే నెల యల్లమ్మ జాతర



పోలమాంబ అమ్మవారు

దాబాగార్డెన్స్: భోగి, సంక్రాంతి, కనుమ పండగలు ముగిసాయి. ఈ మూడు రోజుల పాటు సందడి చేసిన ప్రజలు జాతర్లు, తీర్థాలకు సిద్ధమయ్యారు. నగరంలో అతి పురాతన దేవాలయమైన అల్లిపురం (బల్లిగిరి)లో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి పరస మహోత్సవం అత్యంత వైభవంగా గురువారం నిర్వహించనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి.

20న పోలమాంబ పరస..

నగర నడిబొడ్డు 30వ వార్డు కుమ్మరవీధిలో వెలసిన బహుముఖ రూపాల పోలమాంబ 67వ పరస ఈ నెల 20 నుంచి 22 వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు సంబంధించి ఈ నెల 10వ తేదీనే రాట మహోత్సవం జరిపారు. 20న పెద్ద ఎత్తున తొలేళ్ల ఉత్సవం జరపనున్నారు. ఆ రోజు ఉదయం అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు, జలాభిషేకం, పసుపు కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. పండగ మహోత్సవాల్లో భాగంగా 21న అమ్మవారి పరస మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి పురవీధుల గుండా అమ్మవారి భక్తుల సమక్షంలో ముత్తయిదువలతో ఘటాభిషేకం, పలు సాంస్కృతిక వేడుకలు నిర్వహించనున్నారు. 6 గంటలకు నిప్పుల గుండం, జాతరను పురస్కరించుకుని పౌరాణిక వేషధారణలు, సాము గారడీలు, దాసుళ్ల సందళ్లు, డీజే వాయిద్యాల హోరుతో పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

22న మహాన్నసమారాధన..

ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22న ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ తెలిపింది. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

చిరువ్యాపారులకు భుక్తి..

పరసల సమయంలో అనేక మంది చిరు వ్యాపారులకు ఆదాయం సమకూరుతుంది. పంచదార చిలుకలు, ఖర్జూరం, బెలూన్లు, మిఠాయిలు, చెరకు గడలు, ఇతర తినుబండారాలు అమ్ముకుని నాలుగు రాళ్లు వెనకేసుకుంటారు. ముఖ్యంగా చిన్నాపెద్దా అందరికీ వినోదం పంచే రంగుల రాట్నానికి పరసల్లో మంచి డిమాండ్ ఉంటుంది. చెక్క గుర్రాలపై ఎక్కి రాట్నం తిరుగుతుంటే ఆ అనుభూతే వేరు. డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్రకథ, నాటకాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల కళాకారులు కూడా బిజీగానే ఉంటారు.

జూదరుల జోరు..

మరో వైపు పరసల సమయంలో కోడి పందాలు, పేకాట, లాటరీ వంటివి జరుగుతుంటాయి. రహస్యంగా వీటిని నిర్వహిస్తుంటారు. కాయ్ రాజా కాయ్ అంటూ వీటి నిర్వాహకులు చిన్నాపెద్దా అందరినీ పిలుస్తుంటారు.

కళాకారులకు డిమాండ్..

జాతరలు.. పరసలు.. తీర్థ మహోత్సవాలంటే కళాకారులకు మంచి గిరాకీ. ఓ వైపు పులుల మోత.. మరోవైపు కాళీమాతల నృత్యాలు.. ఇంకో వైపు బిందెల డ్యాన్సులు.. ఇలా ఎంతో మంది కళాకారులకు జాతరలు కడుపు నింపుతున్నాయి. జాతర్లలో ముఖ్యంగా పులివేషధారణ కళాకారులను విశాఖ నుంచే కాక విజయనగరం తదితర ప్రాంతాల నుంచి తీసుకొస్తుంటారు. కాళీమాత నృత్యాలకు తాడేపల్లి గూడెం నుంచి కళాకారులను రప్పిస్తుంటారు. తీన్మార్ డప్పు కళాకారులు, కాంగో కళాకారులను విశాఖ నుంచే ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తుంటారు.



కళాకారులు

కనుల పండువగా వెంకన్న తిరువీధి



వేంకటేశ్వరస్వామి తిరువీధి నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు



విద్యుత్ దీపాలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం

- గోవింద నామస్మరణతో మార్మోగిన బల్లిగిరి

అల్లిపురం: శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. కనుమ పండగ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు జరిగాయి. ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పల్లకిలో తిరువీధి నిర్వహించారు. ప్రజలు స్వామికి అడుగడుగునా హారతులిచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తిరువీధి అనంతరం స్వామి ఇరు దేవేరులతో కలిసి ఆలయ ప్రవేశం చేసిన అనంతరం స్వామికి విశేషంగా పంచహారతి, నక్షత్ర హారతి, కుంభ హారతితో విశేష హారతులు ఇచ్చారు.

నేడు పరస..

బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక పరస మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఉదయం నుంచి భక్తుల దర్శనాలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలి



మాట్లాడుతున్న అనకాపల్లి సీపీఎం నేత శ్రీరామ్

సీతమ్మధార: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద బుధవారం జరిగిన నిరసన దీక్షను అనకాపల్లి సీపీఎం సెక్రటేరియట్ సభ్యుడు గంటా శ్రీరామ్ ప్రారంభించగా, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు జి. నాయనబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. మూడు నల్ల రైతు చట్టాలను తెచ్చి రైతాంగాన్ని నాశనం చేసి కార్పొరేట్లకు ఆ భూములను కట్టబెట్టే ప్రయత్నం చేసిందని విమర్శించారు. అయితే అలుపెరుగని పోరాటం చేసి మోదీ తన తప్పు ఒప్పుకుని క్షమాపణ చెప్పి నల్ల చట్టాలను రద్దు చేసేలా రైతులు విజృంభించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పూర్ణిమ, వార్వా నాయకులు ప్రకాశరావు, బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు కష్ణమోహన్, గ్రామిక మహిళా యూనియన్ నాయకులు మణి, సీఐటీయూ జగదాంబ జోన్ కార్యదర్శి కె.వి.పి. చంద్రమౌళి, వై. రాజు, చలపతి, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మకరజ్యోతి పూజలు



విశేష అలంకరణలో శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి



పీల వెంకట అప్పలనాయుడును సత్కరిస్తున్న భక్తులు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మశాస్త ఆలయంలో మకరజ్యోతి పూజలు ఘనంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా అయ్యప్ప స్వామికి విశేష పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకుడు భార్గవ శర్మ చేపట్టారు. అయ్యప్ప స్వామిని విశేషంగా అలంకరించి హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్, గురుస్వామి, నీలాపు వెంకట రమణారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోదండ రామస్వామి దేవస్థానంలో..

అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల బల్లిగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి అనుబంధ దేవాలయం శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో వెలసిన అయ్యప్ప దేవాలయంలో పీల వెంకట అప్పలనాయుడు మకరజ్యోతి కార్యక్రమం చేపట్టారు. అనంతరం విశిష్ట భక్తుడు పీల వెంకట అప్పలనాయుడును భక్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సినిమా చూసిన ఆశ్రమ వాసులు



జగదాంబ థియేటర్ వద్ద ఆశ్రమ వాసులు

దాబాగార్డెన్స్: పక్షం రోజుల పాటు స్వామి వివేకానందుని జయంతి ఉత్సవాలు జరిగాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండగ ముగిసింది. వివేకానంద ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధుల మానసిక ఉల్లాసానికి సంక్రాంతి, కనుమ పండగను పురస్కరించుకుని నగరంలోని జగదాంబ థియేటర్లో ప్రదర్శిస్తున్న డాకు మహారాజ్ సినిమాను సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఆశ్రమ వాసులకు చూపించారు. ఆశ్రమ వాసుల్లో ఆనందోత్సాహం నెలకొంది.

ఈ రహదారిలో ప్రయాణం.. నరకం

- అస్తవ్యస్తంగా కలెక్టరేట్ నుంచి జిల్లా పరిషత్ రోడ్డు



ఇష్టారీతి పార్కింగ్‌తో అస్తవ్యస్తంగా ట్రాఫిక్

మహారాణిపేట: ఆ దారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది. ఎప్పుడూ రోడ్డు మీద వాహనాలు నిలిపి ఉంచడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి ఒక్క కానిస్టేబుల్ కూడా అందుబాటులో ఉండరు. ఇది ఎక్కడో కాదు కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో. కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ రోడ్డులో ప్రయాణం అంటేనే వాహన చోదకులు గాబరా పడుతున్నారు. ఈ రోడ్డు మీద పలు వాహనాలు నిలిపేసి ఉంచడం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక్కడే అనేక క్లినిక్‌లు, పరీక్ష కేంద్రాలు, స్కానింగ్, ఎక్స్‌రే సెంటర్లు ఉన్నాయి. ఇక్కడ వైద్య సేవల కోసం నిత్యం పలు వాహనాల్లో రోగులు, వారి బంధువులు వస్తుంటారు. ఈ వాహనాలను రోడ్ల మీద పెట్టి వారు క్లినిక్‌లలోకి వెళ్తుంటారు. దీనివల్ల ఈ రహదారిలో వెళ్లే సిటీ బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ట్రాఫిక్ రద్దీలో నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

శిథిలావస్థలో జీవీఎంసీ దుకాణాలు



శిథిలావస్థకు చేరుకున్న టీఎస్ఆర్ కాంప్లెక్స్ దుకాణ సముదాయం

సీతమ్మధార: జీవీఎంసీకి చెందిన టీఎస్ఆర్ కాంప్లెక్స్‌కి ఏళ్ల తరబడి మరమ్మతులు, ప్యాచ్ వర్కులు లేకపోవడంతో కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇక్కడి ద్వారకా బస్‌స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్‌కి వెళ్లే మార్గంలో గల టీఎస్ఆర్ కాంప్లెక్సులో అధిక సంఖ్యలో దుకాణాలు ఉన్నాయి. జీవీఎంసీ జోన్-3 రెవెన్యూ విభాగం పరిధిలో ఈ వాణిజ్య సముదాయం ఉంది. అలాగే ఈ కాంప్లెక్సులో జీవీఎంసీ-ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహం, నాటక గ్రంథాలయం కూడా ఉన్నాయి. ఈ కాంప్లెక్సులో దశాబ్దాలుగా చెప్పుల దుకాణాలు, ఫ్రూట్ జ్యూస్, హోటళ్లు, బంగారం దుకాణం, బట్టల దుకాణాలు ఉన్నాయి. వినియోగదారులతో నిత్యం రద్దీగా ఉండే ఈ భవనం శిథిలావస్థకు చేరుకుని పెచ్చులు రాలిపోతున్నా జీవీఎంసీ ఇంజినీర్లలో చలనం లేదని స్థానిక వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా అద్దెలు వసూలు చేస్తున్న జీవీఎంసీ జోన్-3 రెవెన్యూ విభాగం మరమ్మతులపై దృష్టి సారించడం లేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వర్షాలు పడితే శ్లాబు నుంచి నీరు కారిపోతోందని వ్యాపారులు వాపోతున్నారు. ఇక్కడ జీ ప్లస్ 2 విధానంలో రెండు భవనాల్లో దుకాణాలు ఉన్నాయి. నగరంలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రజలు ఇక్కడికి షాపింగ్ నిమిత్తం వస్తుంటారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, ఇంజినీర్లు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.

తప్ప తాగారు.. చిందులేశారు



పూర్ణామార్కెట్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న మందుబాబు



మద్యం సేవించి తోపుడు బండి కింద సేద దీరుతున్న మందుబాబు

దాబాగార్డెన్స్: కనుమ పండగ సందర్భంగా మందుబాబులు పూటుగా మద్యం సేవించి నడిరోడ్లపై చిందులేశారు. ఉదయం నుంచే మందుబాబుల హడావిడి కనిపించింది. మార్కెట్లకు వెళ్లి కోడి/మటన్ మాంసం కొనుగోలు చేసి, ఇంటికి ఇచ్చేసి నడిరోడ్డుపై పడ్డారు. తెలియని మత్తులో ఎక్కడ పడ్డారో వారికే ఎరుక. సాయంత్రం పొద్దు పోయే వరకు మద్యం సేవిస్తూ నడిరోడ్లపై చిందులేశారు. చాలా చోట్ల డీజే వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ పలువుర్ని ఆకట్టుకున్నారు. నృత్యాలు వేసే వారు కొందరైతే.. నడిరోడ్డుపై తప్పతాగి పడిన వారు మరికొందరు. ఇలా బస్టాప్‌లు.. ఆటోస్టాండ్లు.. దుకాణాల వద్ద మందుబాబులు సందడి చేస్తూ కనిపించారు.



నడిరోడ్డుపై డీజే వాయిద్యానికి నాగినీ నృత్యం చేస్తున్న మందుబాబులు

నిద్ర సుఖమెరుగదు..



దండుబజార్‌లో కోడిమాంసం దుకాణం వద్ద కునుకు తీస్తున్న వ్యాపారి



చికెన్ సెంటర్‌లోనే కునుకు తీస్తున్న వ్యక్తి

దాబాగార్డెన్స్: ఆకలి రుచెరుగదు.. నిద్ర సుఖమెరుగదు అంటారు పెద్దలు. సంక్రాంతి పండగ ముగిసింది. కనుమ పండగ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసే నాన్‌వెజ్ ప్రియులకు ఆ పండగ కూడా వచ్చేసింది. ఉదయం నిద్ర లేచిన నాన్‌వెజ్ ప్రియులు బజారుకి క్యూ కట్టారు. కోడి/మేక మాంసం కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. నాన్‌వెజ్ ప్రియుల కోసం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అలుపెరగని సేవలందించిన మాంసం దుకాణదారులకు కాస్త సమయం దొరకడంతో తమ దుకాణాల్లోనే ఇలా కునుకు తీస్తూ 'సాక్షి' కంట పడ్డారు.

మురుగు నీటితో సమస్యలు



నూనె మిల్లు వీధిలో రహదారి పైకి వస్తున్న మురుగు నీరు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు నూనె మిల్లు వీధిలో ఇటీవల జీవీఎంసీ సీసీ రోడ్డు నిర్మించింది. ఇక్కడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉంది. ఇందులో నుంచి జగదాంబ, కేజీహెచ్ మీదుగా వచ్చే మురుగు నీరు ప్రవహిస్తుంటుంది. ఇక్కడ సీసీ రోడ్డు నిర్మిస్తున్న సమయంలో యూజీడీ పైకప్పు శిథిలమై మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తు దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటుగా రాకపోకలు సాగించే వారు మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు వెంటనే యూజీడీకి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ ఖాళీ



వెలవెలబోతున్న నాన్‌స్టాప్ ప్లాట్‌ఫామ్



నిర్మానుష్యంగా సిటీ బస్టేషన్

దాబాగార్డెన్స్: ఆర్టీసీ కాంప్లెక్స్ ఖాళీ అయింది. సంక్రాంతి పండగ సందర్భంగా విశాఖలో నివాసముంటున్న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, అమలాపురం, పాలకొండ, కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల వాసులు విశాఖ నుంచి వారి వారి ప్రాంతాలకు తరలి వెళ్లడంతో నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్ వెలవెలబోయింది. నిన్న మొన్నటి వరకు విపరీతమైన రద్దీతో కిటకిటలాడిన కాంప్లెక్స్ ఒక్కసారిగా బోసిపోయింది. ప్రయాణికుల కోసం బస్సులు ఎదురు చూస్తున్నాయి. మరికొంత మంది కండక్టర్లు, డ్రైవర్లైతే శ్రీకాకుళం.. రాజమండి నర్సీపట్నం.. అంటూ కేకలు వేస్తూ ప్రయాణికులను ఆహ్వానిస్తున్నారు. టికెట్ కౌంటర్ కూడా బోసిపోవడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ అంతా నిర్మానుష్యంగా మారింది.



నిత్యం రద్దీగా ఉండే ద్వారకా బస్టేషన్ ముఖ ద్వారం ఇలా..

వెలవెబోయిన సిటీ బస్టేషన్..

సుదూర ప్రాంతాల నుంచి విశాఖ వచ్చే వారి రాకపోకలు స్తంభించడం, వివిధ ప్రాంతాల నుంచి విశాఖకు వలసలు వచ్చిన వారు వారి వారి ప్రాంతాలకు వెళ్లడం, స్థానికంగా నివాసం ఉన్న ఉద్యోగులు, కార్మికులకు సెలవులు రావడంతో సిటీ సర్వీస్ వెలవెలబోయింది. ప్రయాణికుల తాకిడి లేకపోవడంతో సిటీ సర్వీసులు ఖాళీ (ఒకరిద్దరు ప్రయాణికులతో)గా వెళ్తున్నాయి.

నేటి నుంచి రద్దీ..

ఇదిలా ఉండగా.. సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామీణ ప్రాంతానికి తరలి వెళ్లిన విశాఖ వలస వాసులు గురువారం నుంచి తిరుగుముఖం పట్టనున్నారు. విశాఖ నుంచి పెద్ద ఎత్తున ఉత్తరాంధ్ర జిల్లాలకు తరలి వెళ్లిన వారంతా పట్టణానికి తరలి వచ్చే దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

కదిలే బొమ్మల కమ్మని కబుర్లు



కదులుతూ కబుర్లు చెప్పేవి తోలుబొమ్మలు. సినిమాలు, టీవీలు లేని రోజుల్లో జనసామాన్యానికి ఇవే వినోద సాధనాలు. తెరలు కట్టి.. ఆ తెరల వెనుక నుంచి సన్నని దారం సాయంతో వీటిని తోలు బొమ్మలాటగాళ్లు కదిలిస్తూ.. రామాయణ, భారత, భాగవతాల్లోని ఘట్టాలను ప్రదర్శిస్తూ ఉపాధి పొందేవారు. తర్వాతి కాలంలో ఇవి కనుమరుగయ్యాయి. ఈ తరం వారికి వీటి గురించి ఏమాత్రం తెలియదు. మళ్లీ ఇవి ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. నగరంలో పలుచోట్ల ఫుట్‌ఫాత్‌లపై వీటిని విక్రయిస్తున్నరు. – జగదాంబ